

ఆడబిడ్డను బతకనిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ప్రాంతంలో తల్లి గర్భంలోనే ఆడపిల్లలను అంతమొందిస్తున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. 'ఆడబిడ్డను బతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం' అని పిలుపునిచ్చారు. కలెక్టర్ సమీక్షలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో వెయ్యి మంది మగపిల్లలకు 629 మంది ఆడపిల్లలు ఉన్నారని గుర్తించారన్నారు. జిల్లా సరాసరి 916 మంది ఉండగా 287 మంది ఆడపిల్లలు ఈ ప్రాంతంలో తగ్గడానికి ప్రధాన కారణం స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడమేనన్నారు. ఈ దుర్మార్గానికి కారకులైన స్కానింగ్ సెంటర్లు గూడూరు, నాయుడుపేట ప్రాంతాల్లో ఉన్నా వైద్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఆడపిల్లలు తగ్గిపోవడం వల్ల భవిష్యత్‌లో విపత్కర పరిస్థితులు ఏర్పడతాయన్నారు. రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగం, మహిళాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తగు చర్యలు తీసుకుని ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంతోషంతో...సొంతింటికి..!



రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాయలసీమవాసులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సంతోషం వారి మోములో వెల్లివిరిసింది. బతకడానికి, చదువుకోడానికి దేశం గాని దేశం వెళ్లిన ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం నేపాల్ అల్లర్లలో చిక్కుకుపోయిన విషయం విదితమే. మంత్రి నారా లోకేష్ చొరవతో ఖాట్మండ్ నుంచి గురువారం రాత్రి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ప్రత్యేక విమానాల ద్వారా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చి, అక్కడనుంచి సొంతూళ్లకు రోడ్డుమార్గంలో పయనమయ్యేలా ఏర్పాట్లు చేశారు.

బతకడానికి, పర్యాటకానికి, చదువుకోడానికి వెళ్లిన తెలుగువారిని రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మంత్రి నారా లోకేష్ స్వరాష్ట్రానికి తీసుకొచ్చారు. గురువారం రాత్రి 10.10 నిమిషాలకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రేణిగుంటకు తీసుకొచ్చారు. వీరికి కడప, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, తిరుపతి జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు స్వాగతం పలికి, వారి వారి స్వగ్రామాలకు వెళ్లేలా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులకు తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని, పూతలపట్టు ఎంఎల్‌ఎ మురళీమోహన్, కడప ఎంఎల్‌ఎ మాధవరెడ్డి, సూళ్లూరుపేట ఎంఎల్‌ఎ విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు స్వాగతం పలికారు. వారికి భోజన ఏర్పాట్లు చేసి, అధికార యంత్రాంగమే వారి సొంతూళ్లకు వెళ్లేలా వాహనాలను ఏర్పాటు చేసింది. తిరుపతి జిల్లావారు 14 మంది ఉన్నారు. చంద్రబాబు, నారా లోకేష్ నాయకత్వం వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. నేపాల్ నుంచి 217 మంది తెలుగువారిని ఆంధ్రరాష్ట్రానికి తీసుకురాగా, రేణిగుంట విమానాశ్రయానికి వందమంది పైనే చేరుకున్నట్లు సమాచారం.

వేడుకగా వెంకటగిరి జాతర


వెంకటగిరి జాతరలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం, కలెక్టర్ వెంకటేశ్వర్

6లో

'తాతయ్యగుంట గంగమ్మ' ఆలయ ఛైర్మన్‌గా మహేష్‌యాదవ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడి పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో నెంబర్ 1084 ఉత్తర్వులు జారీ చేసింది. దేవదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హరి జవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా నైనర్ మహేష్ యాదవ్ నియమితులయ్యారు. ఆయనతో పాటు పదిమంది కూటమి పార్టీకి చెందిన వారిని డైరెక్టర్లుగా నియమించారు. డైరెక్టర్లుగా ఎం గుణ, జి.భాగ్యవల్లి, బి సుబ్రహ్మణ్యం, రాజా రుద్ర కిషోర్, ఏ వరలక్ష్మి, పి విమల, టి చంద్రశేఖర్, ఎన్ శ్యామల, ఉయ్యాల మధులత, ఈ. లక్ష్మణరావును. బోర్డ్ ఎక్స్ అఫీషియల్ మెంబెర్‌గా జి ఎస్ మురళి ఉంటారు. ప్రమాణ స్వీకారం త్వరలో చేయనున్నారు



ఎస్వీయూలో ఏచూరికి ఘన నివాళి : ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి - క్యాంపస్

యూనివర్సిటీ సమస్యలపై విద్యార్థులు గళం విప్పాలని, అదే సీతారాం ఏచూరికి ఘనమైన నివాళి అని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు అన్నారు. ఎస్వీయూ లైబ్రరీ ముందు ఎస్ఎఫ్ఐ మాజీ అఖిల భారత అధ్యక్షులు సీతారాం ఏచూరికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వందవాసి నాగరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి దేశానికి ఎనలేని సేవ చేశారన్నారు. విద్యార్థిగా ఉన్నపుడే ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీకి ఎదురుగా ఆమె రాజీనామా చేయాలని ధైర్యంగా నిలదీశారన్నారు. ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. బతికినంత కాలం లౌకికత, ప్రజాస్వామ్యం కోసం పోరాడారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి ప్రతి ఒక్కరికీ అందాలని కృషి చేశారన్నారు. మరణానంతరం తన శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం మెడికల్ కాలేజీకి దానం చేసి, పేద బడుగు వర్గాల కోసం నిరంతరం శ్రమించారన్నారు. ఆయన స్ఫూర్తితో దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని, యూనివర్సిటీ సమస్యలపై విద్యార్థులు గళం విప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, ఉపాధ్యక్షులు అశోక్, వినోద్, యూనివర్సిటీ అధ్యక్షులు నరసన్న, నాయకులు వాసు, తిరుమలేష్, రాజు పాల్గొన్నారు.

నేడు ఏచూరి వర్ధంతి సభను జయప్రదం చేయండి : సిపిఎం

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పూర్వ అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ శుక్రవారం ఉదయం 10 గంటలకు వేమన విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని, సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిస్టులు, లౌకికవాదులు సామ్యవాద అభిమానులు తప్పక హాజరై ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ బదిలీ

నూతన డిఎఫ్ఓగా సాయిబాబా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీల ప్రక్రియలో భాగంగా తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న వివేక్ ను నెల్లూరులోని ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రీజనల్ మేనేజర్ గా నియమిస్తూ బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయ్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ గా ఉన్న సాయిబాబాను తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారిగా నియమించారు. అలానే గతంలో తిరుపతి జూ పార్కు క్యూరేటరుగా పనిచేసిన భబితను అటవీ శాఖకు చెందిన బయోట్రిమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ గా నియామకం చేశారు. ఇక్కడ పనిచేస్తున్న నరేందిరన్ ను అమరావతిలోని పిసిసిఎఫ్ కార్యాలయంలో

జాతీయ మహిళా సాధికారిత సదస్సు సక్సెస్ కావాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



జాతీయ మహిళా సాధికారిత సదస్సులో ఎవ్వరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వహించి సదస్సును విజయవంతం చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ నెల 14, 15 తేదీలలో తిరుపతిలో జరగనున్న జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్ కు విధులు కేటాయించిన అధికారులతో గురువారం సాయంత్రం కమిషనర్ సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు, తదితర అంశాలపై అధికారులకు విధులు కేటాయించామని తెలిపారు. విధుల్లో ఎవ్వరూ అలసత్వం వహించకుండా ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. వచ్చిన అతిథులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసుకోవాలని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, తుడా ఈ.ఈ. రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ ఇవ్వాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని కోరుతూ డిఆర్ఓకు ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు, జిల్లా అధ్యక్షులు ఎం.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి కిరణ్‌కుమార్, చంద్రారెడ్డి ఉన్నారు. వారు మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు పంప్ ఆపరేటర్లుగా,డ్రైవర్లుగా, ఎలక్ట్రీషియన్లుగా వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారన్నారు. వీరికి ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయడం లేదన్నారు. 2012లో పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని హైకోర్టు చెప్పినా, తిరుపతి జిల్లాలో కేవలం మూడు పంచాయతీల్లో మాత్రమే ఈపీఎఫ్ అమలవుతోందన్నారు. మిగతా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. జీవోలున్నా అమలు చేసే పరిస్థితి లేదన్నారు.

వృద్ధుల అవసరాలు తీర్చడం కనీస బాధ్యత

ప్రజాశక్తి - రేణిగుంట

వృద్ధుల పట్ల గౌరవం, ప్రేమ చూపుతూ వారి అవసరాలను తీర్చడం మన బాధ్యతని వక్తలు ఉద్ఘాటించారు. గురువారం రేణిగుంట సిఆర్ఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో సిఆర్ఎస్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూపర్ సీనియర్లకు ఉచిత చేతికర్రలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులు సికింద్రాబాద్ ఎస్సీ రైల్వే పిసిఎండి డాక్టర్ నిర్మల రాజారామ్, ఏఐఆర్ఆర్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సాగరం శ్రీధర్, జోనల్ సెక్రెటరీ పి. యుగంధర్, ఐఆర్ఎస్ఎంఈ సిడబ్ల్యూఎం ఏ. దేవసహాయం, దాతలు జి. సూర్య ప్రకాష్, ఎం. శ్రీనివాసులు, గుంతకల్ ఐఆర్ఎంఎస్ సిఆర్ఎస్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఏఐఆర్ఆర్ఎఫ్ కార్యదర్శి ఆర్ఎం విజయకుమార్ మాట్లాడుతూ వద్ధులు మనకు మార్గదర్శులని, వారికి సేవ చేయడం మన కర్తవ్యమని అన్నారు. వారి అనుభవాలను, జ్ఞానాన్ని గౌరవించి, వారికి తోడుగా ఉండటమే మనం చేయాల్సిన ముఖ్యమైన కర్తవ్యమని అన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : సెట్విన్ సీఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రతి ఒక్కరూ ఉద్యోగం పొందేవారు కాకుండా, ఉద్యోగం ఇచ్చే వారిగా ఎదగాలని సెట్విన్ సిఈఓ మోహన్ కుమార్ సూచించారు. మై భారత్ తిరుపతి, చిత్తూరు ఆధ్వర్యంలో ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో స్టార్ట్ అప్ ఇండియా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పెట్టుబడి అవకాశాలను ప్రారంభించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాపార అవకాశాలను ప్రభుత్వం తరఫున అందజేసే రాయితీలను గురించి, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్వియు స్టార్టప్ సిఈఓ వంశీ కష్ణ విద్యార్థులకు పరిశ్రమలకు సంబంధించి తిరుపతి జిల్లాలో ఉన్న అవకాశాల గురించి వివరించారు. ఎస్వీసిఇ కళాశాల ఆచార్యులు గౌతమీ మాట్లాడుతూ బ్యాంకుల రాయితీలు, పూచి కత్తులేని రుణాలు ఏ విధంగా పొందవచ్చనేది వివరించారు. విద్యార్థి విద్యార్థినులకు ఇంక్యువేషన్స్ సెంటర్స్ , ఇన్వెస్టర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ స్థాపనకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. మహర్షి అభ్యుదయ సేవ సంస్థ కె జ్ఞానశేఖర్ రెడ్డి, చిత్తూరు తరపున జిల్లా యువజన అధికారి బి ప్రదీప్ కుమార్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ ప్రాంతీయ గణాంకాధికారి ఎంసీ బాబు రెడ్డి, మై భారత్ సిబ్బంది నాగరాజ, కృష్ణవేణి పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో ఎమ్మెస్ డేటా సైన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

హ్యాకథాన్‌లోఎంఎస్ డేటా సైన్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించడం గొప్ప అవకాశం అని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కాలేజ్ ధతి ఆడిటోరియంలో రీజినల్ సెంటర్ సెమీ ఫైనల్స్ అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ కార్యక్రమానికి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.ఉమ, రిజిస్ట్రార్ రజిని, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కి చెందిన ఆచార్య రోసయ్య, ఎస్ఎస్ ఐఐఈ సూర్య కుమార్ సీఈవో తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులకు సెమీఫైనల్స్ కార్యక్రమం తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు వచ్చాయని, క్వాంటమ్ వ్యాలీ మొట్టమొదటిసారిగా అమరావతి లో ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతలు, సామాజిక సమస్యల పరిష్కారానికి తమ వినూత్న ఆలోచనల దిశగా కషి చేయాలన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వలన ప్రయోజనం పొందిన చాలా మంది ఉన్నత స్థానంలో ఇతర దేశాలలో స్థిరపడ్డారని అన్నారు. సెమీఫైనల్స్ లో విద్యార్థులు తమ సజనాత్మక ఆలోచనలతో ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్ డేటా సైన్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఏడు బందాలుగా, మొత్తం 50 మంది ఈ హ్యాకథాన్ కు ఎంపికయ్యారు.

మామిడి రైతులకు శుభవార్త

37వేల రైతులకు రూ.160 కోట్ల పైబడి సబ్సిడీ / 20-25 తేదీల్లో జమ : చిత్తూరు కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి)



మామిడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలిచిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు కేజీ తోతాపురి రూ.4 చొప్పున రూ.160 కోట్లకు పైగా ఈ నెల 20 నుండి 25 వ తేదీలోపు దాదాపు 37 వేల మంది రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం సచివాలయంలోని సమావేశ మందిరంలో మామిడి రైతులకు జమ చేయనున్న సబ్సిడీపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ మామిడి సీజన్‌లో సుమారు 37 వేల మంది రైతుల నుండి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపు ల ద్వారా దాదాపు 4.10 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోలు చేశాయన్నారు. చివరి కేజీ వరకుకొనుగోలు చేయడం జరిగిందని, పరిశ్రమలు, ర్యాంపుల వద్ద కేజీ రూ.8 అందించడం జరిగిందని, ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.4 అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సెప్టెంబర్ 20 నుండి 25 వ తేదీ లోపు రైతుల ఖాతాలకు డిబిటి పద్ధతిలో సుమారు రూ.160 కోట్లు సబ్సిడీ జమ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి గత రెండు నెలల నుండి క్షేత్ర స్థాయిలో వివరాలను సేకరించామన్నారు. గుజ్జు పరిశ్రమల నుండి 2.35 మెట్రిక్ టన్నులు, ర్యాంపు ల నుండి 1.65 మెట్రిక్ టన్నులు మొత్తం 4.10 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దక్షిణ భారత దేశంలో ఇంత మొత్తంలో మామిడి రైతులకు సబ్సిడీ అందించడం జరగలేదని, రైతులు గుర్తించాలన్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన మామిడిని బట్టి ఒక్కొక్క రైతుకు సుమారు 10 టన్నుల మామిడికి గానూ రూ.40 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల నుండి చెల్లించే నగదు మామిడి గుజ్జు అమ్మకంను బట్టి రైతులకు పరిశ్రమల యాజమాన్యం అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల అభివద్ధి కి సుమారు రూ.20 కోట్లు ఖర్చు చేయగా, మామిడి కాయల కవర్లు, కొత్త మొక్కలు, మౌలిక సదుపాయాలు, ట్రైనింగ్ కి సంబంధించి రూ.10 కోట్లు ఖర్చు చేశామన్నారు. 10,500 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ కొరకు రూ.100 కోట్లకు పైగా ఉపకరణాలు అందించడం జరిగిందన్నారు. సబ్సిడీ కి స్పందించి ప్రభుత్వం ఇచ్చిన సూచనలను మాత్రమే రైతులు గుర్తుంచుకోవాలని, బయట వ్యక్తుల మాటలు నమ్మవద్దని తెలిపారు. సబ్సిడీ జమ కాని రైతులు ఆందోళన చెందవద్దని, ఆర్ ఎస్ కే ల వద్దకు వెళ్లి సమస్యలను తెలియపరిస్తే జమ చేస్తామన్నారు.

తీర్థయాత్రలకు అనువైనది 'మేక్ మైట్రిప్'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సమూహ ప్రయాణం, స్వల్పకాలిక బసలు, చివరి నిమిషంలో బుకింగ్‌లు యాత్రికుల తీర్థ యాత్రలకు అత్యంత అనువైనది మేక్ మైట్రిప్ అని ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు, గ్రూప్ సీఈఓ రాజేష్ మాగోవ్ వెల్లడించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, "తీర్థయాత్ర ప్రయాణం ఎల్లప్పుడూ మన సంస్కతిలో భాగంగా ఉంది. ఇటీవల కాలంలో తీర్థయాత్రలు చేసే కుటుంబంలోని వ్యక్తుల వయసు, ఆదాయ వనరులను దష్టిలో ఉంచుకుని పర్యటక ప్రాంతాలను ఎంచుకుంటున్నారన్నారు. ఎక్కువ శాతం ఒక్కరోజు యాత్రలను ఎంపిక చేసుకుంటున్నారని, 35 శాతం మంది రెండు రోజుల యాత్రను, 15శాతం మంది మూడు రోజులు యాత్రను, కేవలం ఐదు శాతం మంది మాత్రమే నాలుగు రోజులు యాత్రను ఎంపిక చేస్తున్నారని పేర్కొన్నారు. యాత్రికుల అభిలాషను దష్టిలో ఉంచుకుని, వారికి తగ్గ విధంగా సులభమైన, సౌకర్యవంతమైన తీర్థయాత్రలను అందించేందుకు మేక్ మై ట్రిప్ కషి చేస్తుందన్నారు. ప్రయాగ్‌రాజ్ (ఉత్తరప్రదేశ్), వారణాసి (ఉత్తరప్రదేశ్), అయోధ్య (ఉత్తరప్రదేశ్), పూరి (ఒడిశా), అమత్‌సర్ (పంజాబ్), తిరుపతి (ఆంధ్రప్రదేశ్) వంటి కేంద్రాలు, ఖాటు శ్యామ్ జీ (రాజస్థాన్), ఓంకారేశ్వర్ (మధ్య ప్రదేశ్), తిరుచెందూర్ (తమిళనాడు) వంటి ప్రదేశాలు కూడా బలమైన జోరును నమోదు చేస్తున్నాయి, ఈ దార్శనికత ఆధారంగా, కంపెనీ ప్రముఖ ఆధ్యాత్మిక గమ్యస్థానాలలో హోటళ్ళు, హోమ్‌స్టేల కలెక్షన్ అయిన లవ్డ్ బై డివోటీస్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 56 యాత్రా స్థలాలలో 200 కంటే ఎక్కువ పండుగలను కూడా ప్రముఖంగా చాటిచెప్పింది. యాత్రికులు తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవడాన్ని సులభతరం చేసింది. యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట : ఈవో

ప్రజాశక్తి -తిరుమల

శ్రీవారి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా పనిచేయాలని టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2వ తేది వరకు జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలపై గురువారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శాఖలవారీగా ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బ్రహ్మోత్సవాలకు చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. ఈవో మాట్లాడుతూ పారిశుద్ధ్యానికి పెద్ద పీట వేయాలని ఆయన వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సమయంలో మాడ వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు అదనంగా అవసరమైనంత సిబ్బందిని తీసుకోవాలని ఆదేశించారు. గరుడ వాహనం రోజున సీనియర్ అధికారులకు మాడవీధుల్లో విధులు కేటాయించి భక్తుల నుండి ఎప్పటికప్పుడు అభిప్రాయాలను సేకరించాలన్నారు. గ్యాలరీల్లోని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేయాలన్నారు. తిరుమలలో అవసరమైన మేరకు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తిరుపతిలో ప్రత్యేక పార్కింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. నాదనీరాజనం వేదికపై పేరొందిన కళాకారులతో సాంస్కతిక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దాదాపు 3500 మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా జియో ట్యాగింగ్ విరివిగా చేపట్టరన్నారు. 4వేల సీసీ కెమెరాలతో పాటు అదనంగా అవసరమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.శ్రీవారి మెట్టు, అలిపిరి నడకమార్గాల్లో మరింత అప్రమత్తంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ విభాగంలో సమస్యలు తలెత్తకుండా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ టీటీడీ సీవీఎస్వో మురళీకష్ణ, సీఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

టిటిడి శాఖలను పరిశీలించిన నూతన ఈవో



ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి టిటిడి పరిపాలనా భవనంలోని పలు శాఖలను ఈవో అనిల్ కుమార్ సింఘాల్ గురువారం ఉదయం సందర్శించారు. మొదటగా అకౌంట్స్, అన్నదానం, బోర్డు సెల్, ఐ.టి, సోషల్ మీడియా, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్, ప్రజా సంబంధాల కార్యాలయం, ఎస్టేట్ కార్యాలయాలను సందర్శించి సదరు అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా టిటిడి ఈవోకు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఉద్యోగులు నూతన సాంకేతికతను మరింతగా అందిపుచ్చుకుని వేగవంతంగా సేవలు అందించాలని సూచించారు. టిటిడి ఈవో వెంట ఎఫ్ఏ అండ్ సిఏవో ఓ. బాలాజీ, అదనపు ఎఫ్ఏసిఏవో రవిప్రసాద్, చీఫ్ ఇంజనీర్ టి.వి. సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

టిటిడి ఈవో సింఘాల్‌కు సిఐటియు అభినందనలు

రెండోసారి టిటిడి ఈవోగా బాధ్యతలు చేపట్టిన అనీల్‌కుమార్ సింఘాల్‌కు టిటిడి కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ తరపున ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. టిటిడిలో పనిచేస్తున్న ఎఫ్ఎంఎస్, హెల్త్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో ఎఫ్ఎంఎస్ కార్మికులకు, హెల్త్, కాంట్రాక్టు కార్మికులకు దర్శన సౌకర్యం కల్పించాలని, లడ్డూ వడ మంజూరు చేయాలని కోరారు. డ్యూటీలో ఉన్న మహిళా కార్మికులు దుస్తులు మార్చుకోడానికి ప్రత్యేక గది వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఎంప్లాయీస్ క్యాంటీన్‌లా కాంట్రాక్టు వర్కర్లకు తిరుమలలో అన్నప్రసాద క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎఫ్ఎంఎస్ విభాగంలో ప్రతి నెలా పదో తేదీ లోపు కార్మికులకు జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలివ్వాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి మెట్టు చిరువ్యాపారుల సమస్య పరిష్కరించాలి

గత 386 రోజులుగా టిటిడి పరిపాలనా భవనం ఎదుట శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు నిరసన దీక్షలు చేస్తున్నా, సమస్య పరిష్కరించలేదని, నూతన ఈవో సింఘాల్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షులు కె.చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. గత 25 ఏళ్లుగా తాము శ్రీవారి మెట్టు భక్తులను నమ్ముకుని తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, తమ పనిని రెగ్యులర్ చేసి అండగా నిలవాల్సిన టిటిడి యాజమాన్యం ఆంక్షలు మా పొట్ట గొట్టడం సరికాదన్నారు.

సత్యవేడు-చెన్నై బస్సు పునరుద్ధరించండి

: సిపిఎం నాయకులు దాసరి జనార్ధన్



ప్రజాశక్తి - సత్యవేడు: ప్రజలకు అవసరమైన ప్రాంతానికి రవాణా సౌకర్యం కల్పించడం ఆర్టీసీ అధికారులకు, ప్రభుత్వానికి బాధ్యత, కానీ అధికారులు ఇష్టానుసారం బస్సులు నడుపుతున్నారని, సత్య వేడు నుండి నిత్యం చెన్నై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో విమర్శించారు. నిత్యం చెన్నైకు విద్యార్థులు, వ్యాపారులు, కూలీలు, ఉద్యోగస్తులు మహిళలు ప్రయాణాలు సాగిస్తూ టారని తెలిపారు. ఈ క్రమం లోనే సత్యవేడు కేంద్రంగా డిపో కూడా నిర్మించిన సంగతిని అధికారులు విస్మరించడమన్నారు. సత్యవేడు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో కార్మికులకు, ఉద్యోగులకు సత్యవేడు నుండి తమిళనాడుకు ప్రయాణం చేయుటకు రవాణా సౌకర్యం కల్పించా లని డిమాండ్ చేశారు. ముందు నడుస్తున్న విధంగా బస్సులను పున రుద్ధరించపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పంచాయతీ నిర్లక్ష్యం.. వ్యాపారుల పాలిట శాపం



ప్రజాశక్తి - పాకాల: మురి కి కాలువ శు భ్రం చేసేం దుకు తొలగించిన పైరా ళ్లను వేయకపోవ డంతో గట్టుపై ఉండే షాపుల నిర్వ హకులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని చిత్తూరు రోడ్డు సర్కిల్లో కాలు వ శుభ్రం చేసేందుకు తీసిన రాళ్లను మూడు నెలలు గడుస్తున్నా తిరిగి మూయడం లేదు. దీంతో షాపుల యజమానులు తమ షాపులు మూసుకుని వ్యాపారాలు నిలుపుకోవాల్సి వస్తోంది.అధికారులు స్పందించి కాలువలను మూసేయాలని కోరుతున్నారు.

విశ్వ గురువు స్వామి వివేకానంద

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భారతదేశ సంస్కృతి, నాగరికతలను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద విశ్వ గురువుగా ప్రసిద్ధిగాంచారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. వివేకానంద చికాగోలో ఉపన్యాసం చేసిన 132వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కళాశాలలో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ ఏ. దేవకి, డాక్టర్ వి. వాసవి, బి.సూర్యబాబు, డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ జి.గంగయ్య, డాక్టర్ కే. శ్రీదేవి, డాక్టర్ వసంత్, డాక్టర్ కే. శ్రీనివాసులు, డాక్టర్ కే. కోటేశ్వరరావు తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా పరికరాలు వితరణ

ప్రజాశక్తి -ఏర్పేడు : చిందేపల్లి గ్రామ వాస్తవ్యులు, శ్రీ వేణుగోపాలయం, ధర్మకర్త గంగాధర్ గిరిధర్ రెడ్డి (బ్రదర్స్) ఏర్పేడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రస్తుత రూ.15000 విలువ కలిగిన క్రీడా పరికరాలను అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయు రాలు మునిలక్ష్మి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు భాను ప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయుడు మణి, సి ఆర్ పి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - చంద్రగిరి: ప్రజా సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి తిరుపతి రూరల్ మండలంలోని రామానాయుడు రిసార్ట్ లోని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన ప్రజలు నుండి అర్జీలు స్వీకరించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొండుగుంటలో మిషన్ శక్తి సంకల్ప

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధి, కొండ గుంట, జడ్పీ హై స్కూల్ ఐ.సి .డి.ఎస్ ఆధ్వర్యంలో గురువారం మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు సి.డి.పి.ఓ మెహబూబీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలన్నారు. అదేవిధంగా ఆడ పిల్లల రక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను తీసుకువచ్చారని, వాటి గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన బాధ్యత ఉందన్నారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సిబ్బంది సూపరు వైజర్ రాణి, ప్రభావతి, జయమ్మ, ఈశ్వరమ్మ, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు ప్రత్యేక అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కిషోర బాలికలకు సంకల్ప కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ గీతాంజలి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గీతాంజలి మాట్లాడుతూ పౌష్టిక ఆహార ఆవశ్యకత, బాల్యవివాహాలతో వచ్చే నష్టం, పిల్లల హక్కులు, లింగ వివక్షత, సైబర్ భద్రత వంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నవ యువ గ్రూప్ కో ఆర్డినేటర్ రమేష్, గ్రూపులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వడమాలపేట సచివాలయం అంగన్వాడీ టీచర్లు గంగులమ్మ, హేమ లత, వరలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి మౌనిక, ఆశ కార్యకర్త చంద్రకళ పాల్గొన్నారు.

జగన్ ఓర్వలేకున్నారు : టీడీపీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వ విజయాలు, ప్రజాదరణ చూసి జగన్ ఓర్వలేకున్నారని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్య వర్గ కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అయిన సందర్భంగా అనంతపురంలో నిర్వహించిన సభకు ప్రజలు లక్షలాదిగా తరలి రావడాన్ని చూసి జగన్కు మతి భ్రమించి అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీల నిర్మాణం సాకుగా చూపి వివిధ సంస్థల నుండి పొందిన రుణాలను దారి మళ్లించి నిర్మాణాలను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిన ఘనత జగన్ దని ఆరోపించారు. ఈ సమావేశంలో డా.జి.దశరథాచారి, మిస్సల్ రవి, భీమల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో వాకర్లకు వసతులు కల్పించండి

: కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పద్మావతి పార్కులో వాకర్స్కు వాకింగ్ ట్రాక్ బాగుచేసి, జిమ్ పరికరాలను మరమ్మతులు చేయించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం పద్మావతి పార్కు, మస్టర్ గదిని కార్పొరేటర్ పాలిని, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. పార్కు పక్కన ఫుట్ పాత్ పైన ఉన్న షాపులు తొలగించాలని, మస్టర్ గది పక్కన ఉన్న మరుగుదొడ్లలో కుళాయిలు బాగు చేయించాలని, వాకింగ్ ట్రాక్ బాగు చేయించాలని టీడీపీ నాయకులు శ్రీధర్ వర్మ, వాకర్స్ కమిషనర్ ను కోరారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మహేష్, డి.ఈఈ మహేష్, శిల్ప, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య ఉన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి సహకరిస్తాం



ఆధునీకరించిన ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో టీటీడీ చైర్మన్, కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి రీజియన్ పాయింట్గా ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల విశేషాలను, తిరుపతి జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయటంలో తిరుపతి జర్నలిస్టుల పాత్ర ఉన్నతమైనదని, జర్నలిస్టు సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆధునీకరించిన తిరుపతి ప్రెస్ క్లబ్ ప్రాంగణాన్ని టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసే ప్రారంభించారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేసే గొప్ప బాధ్యత కలిగిన జర్నలిస్టులు, వాస్తవాలను మాత్రమే ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యలను, ప్రభుత్వాల తప్పిదాలను ఎప్పటికప్పుడు తమ వార్తల ద్వారా జాగృతి చేస్తున్న జర్నలిస్టుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే బలమైన సాధనం మీడియాని, సీఎం సూచనల మేరకు తిరుపతి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు త్వరలోనే జరుగుతుందని, ప్రెస్ క్లబ్ శాశ్వత భవనం నిర్మాణానికి 25 సెంట్లు స్థలం తిరుపతి కలెక్టరేట్ సమీపంలో కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ వ్యవస్థల్లో ఉన్న లోపాలను ఎప్పటికప్పుడు అన్వేషించి బాహ్య ప్రపంచానికి తెలియజేస్తూ అప్రమత్తం చేసే జర్నలిస్టులు సేవలు మెచ్చుకోదగినవన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లో ఒక వ్యక్తి ఎదగడానికి మీడియా లేనిదే సాధ్యపడదన్నారు. అనంతరం అతిధులను ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షులు మురళి, కార్యదర్శి బాలచంద్ర, కార్యవర్గ సభ్యులు కలిసి సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యులు కిరణ్ రాయల్, బత్తెన మధుబాబు, టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య, మధు శేఖర్, కత్తి సుధాకర్లు పాల్గొన్నారు.

ఘనంగా మిధున్ రెడ్డి జన్మదిన వేడుకలు





ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బి.ఎన్ కండ్రిగ మండల వైసిపి అధ్యక్షుడు కె. మణి నాయుడు ఆధ్వర్యంలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం వైఎస్ఆర్సీపి నేతలు, ప్రజాప్రతి నిధులు, యువత, కార్యకర్తలు, స్థానిక ప్రజల నడుమ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యవేడు ఇంచార్జ్ నూకతోట రాజేష్, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి భేరేంద్ర రాజు, భానుప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా, బుచ్చినాయుడుకండ్రిగ మండలం, నీర్వకోట, చెంగాలమ్మ పరమేశ్వరి దేవాలయం ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గరువారం ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల వైసీపీసీనియర్ నాయకులు, సర్పంచ్ సంఘం అధ్యక్షులు ఆరణి విద్యానదారెడ్డిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ వెంకటమ్మ, ఎంపిటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు ప్రధాన ద్వారం వద్ద రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను వైయస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరిప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా 80 మంది అభిమానులు రక్తదాన చేశారు. రేణిగుంట, అభయక్షేత్రంలో 150 మంది వికలాంగులకు అన్నదానం చేశారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణవనం వినాయక స్వామి ఆలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్లమెంటరీ క్రియాశీలక కార్యదర్శి టి రాకేష్ కిరణ్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, మండల వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీటీడీ ఆసుపత్రుల డైరెక్టర్లతో అదనపు ఈవో సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటి: టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి గురువారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఆధ్వర్యంలోని వివిధ ఆసుపత్రుల డైరెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యులు టీటీడీ ఆసుపత్రులలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోగులకు వైద్య సేవలు అందించే అంశంపై చర్చించారు. గత ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో సీఎం సూచనల మేరకు శ్రీవారి సేవలో భాగంగా ప్రొఫెషనల్ సేవలను ప్రవేశపెట్టాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా, ముందుగా వైద్య రంగం నుండి ఈ ప్రొఫెషనల్ సేవలను ప్రారంభించడానికి అవసరమైన చర్యలను టీటీడీ ప్రారంభించింది. ఈ సమావేశంలో స్విమ్స్ డైరెక్టర్ డా.ఆర్వీ కుమార్, బర్డ్ డైరెక్టర్ డా.జగదీశ్, ఎస్పీసిహెచ్సి డైరెక్టర్ డా.శ్రీనాథ్ రెడ్డి, టీటీడీ సీఎంఓ డా.నర్మద, ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి అధిపతి డా.రేణు దీక్షిత్లతో పాల్గొన్నారు. అదనపు ఈవో మాట్లాడుతూ టీటీడీ ఆసుపత్రుల్లో ఉచిత సేవలు అందించదలచిన వైద్యులు ఆన్లైన్లో బుకింగ్ చేసుకునేందుకు వీలుగా ఓ ప్రత్యేక యాప్ను అభివృద్ధి చేయాలని జిఎంఐటి ఇంచార్జ్ ఫణికుమార్ నాయుడును ఆదేశించారు.

ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డికి ఉద్యోగోన్నతి, బదిలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం: తిరుపతి జిల్లా రామచంద్రాపురం ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డికి ప్రభుత్వం ఎంపీడీవోగా పదోన్నతి కల్పించి చిత్తూరు జిల్లా, ఐరాల మండల ఎంపీడీవోగా బదిలీ చేసింది. రామచంద్రాపురం ఈవోపీఆర్డి పనిచేస్తున్న శ్రీనివాసులను ఇన్చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గురువారం చంద్రశేఖర్ రెడ్డి ఇన్చార్జి రిలీవ్ అయ్యారు.

సహకార బ్యాంకు చైర్మన్గా ఖాదర్ బాషా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు చైర్మన్గా షేక్ ఖాదర్ బాషా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాష్ట్రంలోని పలు సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్లను నియమించారు. వీరు ఆరు నెలల కాలం పాటు సేవలందిస్తారు. ఈ క్రమంలోనే పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఖాదర్ బాషాకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అవకాశం కల్పించారు. ఖాదర్ బాషా టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. సంఘం అభివృద్ధికి తనవంతు సహకారమందిస్తామని ఖాదర్ బాషా తెలిపారు.

14న జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 14న జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక స్థానిక ఆర్పిబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.సుధీర్ తెలిపారు. ఎంపికైన జట్లు విజయవాడలో సెప్టెంబర్ 27,28 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 14వ తేదీ ఉదయం 8 గంటలకు జన్మదిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9032270031 నంబర్ను సంప్రదించాలని కోరారు.

స్కూల్ వద్ద పబ్లిక్ టాయిలెట్ తొలగించండి


ప్రజాశక్తి - తిరుపతి సిటి : టిపిపిఎం స్కూల్ ప్రధాన గేట్ వద్ద మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ను తొలగించాలని హెడ్మాస్టర్ మురుగన్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కోరారు. సమగ్ర శిక్షా, పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగిన మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేకి హెడ్మాస్టర్ పబ్లిక్ టాయిలెట్ తొలగించాలని వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పబ్లిక్ టాయిలెట్ను పరిశీలించడంతో పాటు విష్ణునివాసం అనుకుని డ్రైనేజీ కాలువ పొంగి పొర్లుతుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు హెడ్ మాస్టర్ మురుగన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల ఇబ్బందులు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రభుత్వం ఆదుకుంటుంది

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదుకోవడంలో భాగంగా నగరంలోని టిపిపిఎం స్కూల్లో మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ను పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షా సంయుక్తంగా గురువారం నిర్వహించాయి. క్యాంప్ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల అవసరమైన వాళ్ళు ఈ నెల 16 వరకు అధికారులు కలిసి పొందాలని ఆయన సూచించారు. వారికిచ్చే అలవెన్స్ను మూడు వేల నుంచి ఆరు వేలకు పెంచినట్లు చెప్పారు. దివ్యాంగులకు ఇచ్చే డిజేబుల్ పెన్షన్ను నాలుగు వేల నుంచి ఆరు వేలకు, ఐదు వేల నుంచి పదిహేను వేలకు పెంచినట్టు తెలిపారు. చదువుకునే వారికి ల్యాప్టాప్లు ఇచ్చినట్లు తెలిపారు.

జన జాతర.. భక్తుల రద్దీతో హోరెత్తిన వెంకటగిరి

- పట్టు వస్త్రాలను సమర్పించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం
- 1.65 కోట్ల రూ వ్యయంతో భవన, ధ్యాన మందిర నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర జన జాతరగా మారింది. గురువారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం భక్తుల అమ్మవారి నామ స్మరణతో రాజావీధి దద్దరిలింది. బుధవారం అర్ధరాత్రి కుమ్మరివీధిలోని అమ్మవారిళ్ళుగా భావించే ఇంటి నుండి అమ్మవారి ప్రతిమను తయారుచేసి, అత్తగారిళ్ళయిన జీనిగలవారి వీధిలో అమ్మవారికి కళ్ళు, దిష్టిచుక్క పెట్టి అక్కడ నుండి ఊరేగింపుగా అమ్మవారిగుడి నుండి గురువారం తెల్లవారుజాము నుండే భక్తుల దర్శనార్థం పెట్టారు. సాంప్రదాయం ప్రకారం వెంకటగిరి రాజాలు అమ్మవారికి సారె అందజేశారు. ప్రభుత్వ లాంఛనాలతో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, స్థానిక శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, దేవాదాయ శాఖ కమీషనర్ కె. రామచంద్ర మోహన్లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జాతరకు 40 లక్షల రూపాయలు దేవాదాయ శాఖ నుండి విడుదల చేశామని తెలిపారు. అమ్మవారికి బంగారు ఆభరణాలు, కిరీటం, స్వర్ణ హస్తాలు, స్వర్ణ పాదాలు చేయాలని సంకల్పించి, కోటి 70 లక్షల రూపాయల విలువైన ఆభరణాలు తయారు చేశారు. శాశ్వత రాబడి కోసం 72 అంకణాల స్థలాన్ని అమ్మవారి ఆలయ ట్రస్ట్ పేరుతో మార్పు చేసి, కోటి 65 లక్షల రూపాయలతో భవన సముదాయం, ధ్యాన మందిరం నిర్మించడానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ఏ కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి హర్షవర్ధన్ రాజు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర.. జాతర మహోత్సవం గురువారం రాత్రితో వైభవంగా ముగిసింది. పోలేరమ్మ అమ్మవారిని వెంకటగిరిలో సాకలి వీధిలో పుట్టమట్టితో చాకలి కుటుంబాలు వారు తయారు చేశారు. అక్కడ అమ్మవారికి కళ్ళు మాత్రం పెట్టకుండా అలంకరించి అత్తవారిల్లుగా భావించే జీనుగుల వారి వీధికి తీసుకువచ్చి కళ్ళు పెట్టి బంగారు నగలతో అలంకరించారు అక్కడి నుంచి ప్రత్యేక రథంపై ఊరేగింపుగా అమ్మవారి గుడి వద్దకు తీసుకువచ్చి గురువారం తెల్లవారు జామున భక్తుల దర్శనార్థం ఉంచారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే కే రామకృష్ణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, ఎం ఎల్ సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు

రాష్ట్ర అభివృద్ధికి జగన్ సహకరించాలి

పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె. మురళీమోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజాధరణ పొందడం, మరింతగా అభివృద్ధికి శ్రీకారం చుట్టి మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయడానికి సంకల్పిస్తే దానిపై మతిస్థిమితం కోల్పోయి మాజీ సీఎం జగన్ విరుద్ధంగా మాట్లాడి బెదిరింపులకు దిగడం మంచి పద్ధతి కాదని, రాష్ట్ర అభివృద్ధికి ఆయన సహకరించాలని పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీమోహన్, పులివర్తి నానిలు సూచించారు. ఆధునీకరించిన తిరుపతి ప్రెస్ క్లబ్లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచితే, వక్రీకరించి సామాజిక మాధ్యమాల ద్వారా దొంగ ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు. మతిస్థిమితం కోల్పోయి అసత్య ప్రచారాలు చేయడం తగదని హితవు పలికారు. మళ్లీ అధికారంలోకి వస్తారన్న భ్రమను ఇకనైనా విడాలన్నారు.

రంగంపేటలో రెవెన్యూ గ్రామ సభ

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట పంచాయతీలో ఆరేపల్లి, నాగపట్ల, రెవిన్యూకు సంబంధించి రీసర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం సర్పంచ్ ఎర్రయ్య అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. తహశీల్దారు శివరామసుబ్బయ్య మాట్లాడుతూ రీసర్వేలో ఏమైనా పొరపాట్లు ఉంటే వారం లోపల సరిదిద్దుకో వాలని కోరారు. సచివాలయ సమీపంలో ఉన్న సర్కారు బావి ఉందని, బావి విస్తీర్ణం కబ్జాకు గురైందని గ్రామస్తులు తహశీల్దారు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన తహశీల్దారు విచారణ జరిపించాలని పంచాయితీ సెక్రటరీ, వీఆర్వోలను ఆదేశించారు. గ్రామస్తులు స్మశాన వాటిక ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. తహశీల్దారు వెంటనే నాగపట్ల రెవిన్యూ పరిధిలోని తిరుపతి, పీలేరు జాతీయ రోడ్డుకు అనుకోని ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 80/ఏలో 1.50 ఎకరాల భూమిని పరిశీలించి, ఆస్థలాన్ని స్మశానానికి కేటాయించారు. ఈకార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్ బాబు, వీఆర్వో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యస్జిఎఫ్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల కేంద్రం, ఏకొల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో 69 యస్జిఎఫ్ మండల స్థాయి క్రీడలను ఎంఈఓలు కొండయ్య, కృష్ణయ్యలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, కోకో, షటిల్, కబడ్డీ, అథెలిటెక్స్, యోగ, చెస్ వంటి పోటీలను ప్రారంభించారు. మండలలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, బిసి గురుకులపాఠశాల, కెజిబివి పాఠశాల, మోడల్ స్కూల్, తదితర పాఠశాలలోని సుమారు 200 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవులు మృతి




ప్రజాశక్తి -కోట : కోట మండలం, కొత్తపట్నం పంచాయతీ, వావిళ్లదొరువు గ్రామంలో ఆవులు మేత కోసం పొలాల్లోకి వెళ్లి తిరిగి వస్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తగలి నాలుగు ఆవులు మృతి చెందాయి. ఈ ఆవులు ఎస్ కే.కరీముల్లా సాహెబ్, చిన్న వెంకటయ్య, ఇంగిలాల ఆదిమూర్తిలకు చెందినవని గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న కోట ఎస్ఐ పవన్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎక్స్ట్రా బేక్స్లో ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి -కోట : కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుపతి జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ మద్దిలేటి హెచ్చరించారు. గురువారం కోట మండలం, విద్యానగర్, ఎక్స్ట్రా బేక్స్లో కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, కోట మండల బీజేపీ అధ్యక్షులు పులి సురేష్లు తిరుపతి జిల్లా ఫుడ్ అధికారులకు పిర్యాదు చేయడం జరిగింది. తనిఖీలు చేసిన ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం శాంపుల్స్ తీసుకెళ్లారు. కల్తీ పదార్థాలు విక్రయంపై నివేదిక పై స్థాయి అధికారులుకు పంపుతామని తెలిపారు.

హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, గాంధీనగర్ సమీపంలో బుధవారం జరిగిన రహీద్ భాషా హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని, అతని కుటుంబసభ్యులు గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్య చేసిన వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించి, ఈతరహా చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

శివుని సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి, అమ్మవార్లను గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, ఝార్ఖండ్ మాజీ సీఎం సరయు రాయ్, టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్, రాజస్థాన్ హైకోర్టు జడ్జి అవినాష్ జింగాన్ కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, పాత బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఒకటవ పట్టణ ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు, గూడూరు పాత బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి పడి పోయి ఉండగా దారిన పోయే వారు గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారన్నారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృత దేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుని మెడలో వెంకయ్య స్వామి రాగి డాలర్ ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన ఎవరైనా గూడూరు ఒకటవ పట్టణ పోలీస్లు 9490413803, 9440796342 నంబర్లకు తెలియచేయాలన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్యాంకర్ను ఢీకొట్టిన టిప్పర్.. ఒకరు మృతి



ప్రజాశక్తి - పుత్తూరు: తిరుపతి, పుత్తూరు హైవేపై, ఏసీజే కళ్యాణమండపం సమీపంలో గురువారం ఉదయం చెట్లకు నీళ్ల పడుతున్న ట్యాంకర్ను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో టిప్పర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదంతో కొంతసేపు ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. మృతుడు పున్నేరు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి వివరాలు, ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. పోలీసు అధికారులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 మంది ఎర్రచందనం స్మగ్లర్స్ అరెస్ట్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి, అన్నమయ్య జిల్లా, సానిపాయ అటవీ ప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడిన 15 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం అన్నమయ్య జిల్లా సానిపాయ, వీరబల్లి ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిందని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. అప్పయ్యగారిపల్లి అటవీప్రాంతం చేరుకునే సరికి అక్కడ రెండు కార్లు కనిపించాయని, వాటిని సమీపించడంతో కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను కార్లలోకి లోడ్ చేస్తూ కనిపించారన్నారు. దీంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని చుట్టుముట్టగా పారిపోవడానికి ప్రయత్నించారని, వారిని వెంబడించి 15 మందిని పట్టుకున్నామన్నారు. వాహనాలను తనిఖీ చేయగా 15 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. పట్టుబడిన స్మగ్లర్లు అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన వారుగా గుర్తించామన్నారు. దీనిపై టాస్క్ ఫోర్స్ సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన కార్తీక్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పి, డివైడర్ను ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చేసుకుంది. పోలీసుల కథనం మేరకు చిత్తూరు పట్టణం సామంతి పురం వీధికి చెందిన కొమరవెల్లి కార్తీక్ (26) స్కూటర్పై, తిరుపతి రూరల్ ఉప్పరపల్లి క్రాస్ నుండి తుమ్మలగుంట వైపు వస్తుండగా వాహనం అదుపుతప్పి డివైడర్ను ఢీకుంది. ఈ ప్రమాదంలో కర్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.